అట్లెట్ల కడుతున్నారు..? ఆపేయండి..!


నిర్మాణ దశలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయ భవనం

వైసీపీకి నగరపాలిక అధికారుల నోటీసు

జిల్లా కార్యాలయ భవన నిర్మాణం ఆపేయాలని..

అనంతపురం క్రైం, జూన్ 22: నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయం వ్యవహారంపై నగరపాలిక టౌన్ ప్లానింగ్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా అక్రమ నిర్మాణం చేపట్టారనే కారణం చూపుతూ శనివారం నోటీసులు జారీ చేశారు. అనుమతులు లేకున్నా.. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉండటంతో అధికారులు స్పందించలేదు. నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ మారుతి హరిప్రసాద్ శనివారం సాయంత్రం 5 గంటలకు నోటీసులు ఇచ్చారు. 'అనుమతులు లేకుండా భవన నిర్మాణ పనులు చేపట్టారు. తక్షణమే పనులను ఆపేయండి. చట్ట ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోకూడదో ఏడు రోజుల్లోగా చెప్పండి..' అని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నోటీసుకు స్పందన లేకపోతే మరో నోటీసు జారీ చేస్తారు. ఆ నోటీసుకు 24 గంటలు సమయం మాత్రమే ఉంటుంది. సరైన స్పందన లేకపోతే ఆ భవనాన్ని కూల్చివేసే అధికారం నగరపాలిక అధికారులకు ఉంటుంది. అప్రూవల్ తీసుకోకుండా వ్యవహారం నడిపిన వైసీపీ నేతలు, ఖాళీ స్థల పన్ను కూడా ఆలస్యంగానే చెల్లించారు. అప్రూవల్‌కు ముందు వేకెంట్ ల్యాండ్ టాక్స్ (వీఎల్‌టీ) రూ.7.30 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. తొలుత రూ.30 వేలు మాత్రమే చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని చెల్లించాలని అధికారులు అడిగినా పట్టించుకోలేదట. పార్టీ అధికారం కోల్పోవడంతో ఈ నెల 17న మిగిలిన రూ.7 లక్షలు చెల్లించారు.

నిజం తేలేనా?

హౌసింగ్‌లో భారీగా అవినీతి..!

- మాజీ ఎమ్మెల్యే, పీడీ, ఇద్దరు డీఈఈలపై ఆరోపణలు
- అవినీతిపై గతంలోనే పరిటాల సునీత ఫిర్యాదు
- అధికారం అండతో నివేదికను తొక్కిపెట్టిన తోపు
- తాజాగా తెరపైకి అప్పటి ఫిర్యాదు
- అక్రమార్కుల్లో ఆందోళన
- సెలవులో పీడీ.. విచారణ పేరుతో మరో అధికారికి బాధ్యత అప్పగింత


అధికారులతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సమీక్ష (ఫైల్)

అనంతపురం సిటీ, జూన్ 22:
గత ప్రభుత్వ పాలనలో జిల్లా గృహ నిర్మాణశాఖలో భారీగా అవినీతి జరిగిందనే ప్రచారం జోరందుకుంది. ఇల్లు మంజూరు నుంచి ఇసుక, సిమెంట్ తదితర సామగ్రి సరఫరాతో పాటు బిల్లులు మంజూరులో సైతం పెద్దఎత్తున అవినీతి జరిగిందనే చర్చ ఆ శాఖలో సాగుతోంది. ఈ వ్యవహారంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితో పాటు ఆశాఖ పీడీ, ఇద్దరు డీఈఈలు(వీరిలో ఒకరు ఈఈ ఇన్‌చార్జిగా, మరొకరు ఏఈగా పనిచేశారు), వీరితో పాటు రాప్తాడుకు చెందిన మరో ఏఈ పై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొన్ని నెలలు కింద ఇళ్ల నిర్మాణాల్లో అవినీతి జరిగిందని ప్రస్తుత రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేయగా.. అవినీతి జరిగినట్లు ఓ ఈఈ స్థాయి అధికారిణి కూడా గుర్తించారు. అయితే నివేదిక పైకి చేరకుండా కొందరు అధికారులు(తోపు అండతో) అడ్డుపడి బుట్టదాఖలు చేసినట్లు సమాచారం. తాజాగా టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో పరిటాల సునీత చేసిన అప్పటి ఫిర్యాదు మరోమారు వెలుగులోకి వచ్చింది. పరిటాల సునీత ఆశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి అవినీతిపై ఆరా తీయడం తో తోపు నుంచి.. పై స్థాయి అవినీతి అధికారుల్లో అలజడి మొదలైంది. ఈ నేపథ్యంలో పీడీ సెలవులో వెళ్లడంతో పాటు ఆ ఫిర్యాదుపై విచారణ చేయడా నికి (అప్పుడు చేసిన ఈఈ కాకుండా) అనుకూలమైన మరో డీఈఈతో పాటు మరికొందరు ఉద్యోగులను కమిటీగా నియమించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

● రూ. కోట్లలో అవినీతి

జగనన్న ఇళ్ల నిర్మాణం పేరుతో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేసిన అవినీతి అంతా..ఇంత కాదనే విమర్శలున్నాయి. గత ఐదేళ్లుగా ఆయన ఆధ్వర్యంలో నడిచే సంస్థ చేసిన నిర్మాణం కంటే బిల్లులు రూపంలో దోచిందే ఎక్కువ అన్నట్టుగా ఉంది. ఇందుకు ఆశాఖలో పనిచేస్తున్న ఒక ఈఈ(డీఈ) కీలకంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. ఈయన గృహనిర్మాణ శాఖకు ఏ పీడీ వచ్చిన తోపు అండదండలతో వారికి దగ్గర అయ్యేవాడు. ఈనేపథ్యంలోనే పీడీతో పాటు మరో డీఈఈ, అనుకూలమైన ఏఈఈలను అడ్డం పెట్టుకుని ఎక్కడికక్కడ అందినకాడికి తోపుదుర్తికి దోచిపెట్టారనే విమర్శలున్నాయి. పెద్దస్థాయిలో ఈ దందా సాగుతుండటంతో మిగిలిన అధికారులు, ఉద్యోగులు ఏమీ చేయలేక మిన్నకుండిపోయారు. ఒకనొక సందర్భంలో ఇన్‌చార్జి ఈఈకి బదిలీ వచ్చినా తోపు అండతో జిల్లాకు బదిలీ అయిన ఈఈని రానివ్వకుండా.. ఆపేసి తన ఇన్‌చార్జి ఈఈ ఉద్యోగాన్ని నిలబెట్టుకున్నట్లు సమాచారం. అయితే ఎన్నికల సమయంలో ఆ ఉద్యోగాన్ని వదులుకుని మరో ప్రాంతానికి డీఈఈగా వెళ్లిపోయారు. కానీ ఆ అధికారి మాత్రం ఇప్పటికి పాత పంథాలోనే వ్యవహరిస్తున్నారని తెలిసింది.

● పరిటాల సునీత ఫిర్యాదు చేసినా స్పందన అంతే..

వైసీపీ అధికారంలో ఉండగా.. జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో తోపునకు చెందిన రాక్రీట్ సంస్థ భారీ ఎత్తున దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆశాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు కూడా ఆ సంస్థకు వంత పాడుతూ అవినీతికి ఆజ్యం పోశారనే విమర్శలున్నాయి. ఈనేపథ్యంలో రాప్తాడు నియోజకవర్గం పరిధిలో జగనన్న ఇళ్ల పేరుతో భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని ఏడాది కిందట రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత లిఖిత పూర్వకంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ అప్పటి పీడీ కేశవనాయుడును విచారణకు ఆదేశించారు. ఆయన కూడా ఓ మహిళా ఈఈని విచారణ చేసి నివేదిక ఇవ్వమని చెప్పారు. ఈ విచారణ సాగుతుండగానే.. పీడీ బదిలీ కావడంతో డీఆర్‌డీఏ పీడీకి హౌసింగ్ ఇన్‌చార్జిగా బాధ్యతలు వచ్చాయి. ఆయితే విచారణలో అవినీతి, అక్రమాలు జరిగినట్లు మహిళా ఈఈ గుర్తించి ఇన్‌చార్జి పీడీకి నివేదిక అందజేసినట్లు సమాచారం. అయితే వైసీపీ అధికారంలో ఉండటం, అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే తోపు అండగా ఉండటంతో ఆ నివేదిక జిల్లా కలెక్టర్‌కు పంపకుండా ఆపేసినట్లు సమాచారం. దీంతో అవినీతికి పాల్పడిన అధికారులకు కొంత ఊరట కలిగినట్లైంది.

●కూటమి రాకతో వెలుగులోకి ఫిర్యాదు

ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ కూటమీ అధికారంలోకి రావడం.. రాప్తాడు ఎమ్మెల్యేగా పరిటాల సునీత విజయం సాధించడంతో తోపుతో పాటు అవినీతి అధికారుల్లో ఆందోళన మొదలైంది. ఈ వ్యవహారం నుంచి తప్పించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి. ఎమ్మెల్యే పరిటాల సునీత ఇటీవల ఆశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి జరిగిన అవకతవకలు, అప్పట్లో అందజేసిన ఫిర్యాదుపై నివేదికను అందజేయాలని ఆదేశించింది. అయితే ఈ సమీక్షకు సెలవులో వెళ్లిన ఇన్‌చార్జి పీడీ హాజరుకాకపోవడం గమనార్హం.

● సెలవులో పీడీ.. మరొకరికి బాధ్యతల అప్పగింత

అవినీతిలో భాగస్వాములైనందుకు తనకు కూడా శిక్ష పడుతుందనో.. లేక.. నిజంగానే.. కాలికి గాయం కావడంతోనో ఇంతవరకు ఆశాఖ ఇన్‌చార్జి పీడీగా పనిచేసిన ఆయన ఉన్నఫలంగా రెండు రోజుల కిందట సెలవుపై వెళ్లారు. దీంతో చేసిన అవినీతి అక్రమాలు పక్కదారి పట్టించాలనే పెద్దఎత్తున పన్నాగాలు పన్నుతున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే క్రమంలో విచారణ కూడా తూతూ మంత్రంగా చేసి కలెక్టర్‌ను బురడికొట్టించాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అవినీతి, అక్రమాలు నూతన కమిటీతో వెలుగులోకి వస్తాయా..? లేక.. గతంలో అవినీతి ఆక్రమాలు జరిగాయనీ.. అప్పట్లో ఓ ఈఈ నివేదిక ఇచ్చినా.. అధికారం అడ్డుపెట్టుకుని బుట్టదాఖలు చేసినట్లై.. ఈ నివేదికను వెలుగులోకి రాకుండా చేస్తారా..? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నాన్నా.. నువ్వు మనిషివేనా..?



కూతురిని బావిలో పడేసిన తండ్రి

తనకు పుట్టలేదన్న అనుమానంతో..

నార్పలలో అమానవీయ ఘటన

సాయంత్రం రావాల్సినోడివి.. మధ్యాహ్నానికే నాకోసం వచ్చావ్..! బడి నుంచి త్వరగా ఇంటికి పోతున్నానని ఎంత సంబరపడ్డానో తెలుసా..? నీతో కలిసి ఆటోలో రయ్ రయ్‌మని ఇంటికి వెళ్లి.. తమ్ముడితో ఆడుకోవాలనుకున్నా..! అమ్మ పెట్టే బువ్వ కడుపు నిండా తినాలనుకున్నా..! నువ్వు ఆటోను పొలాల వైపు మళ్లిస్తుంటే.. ఏదైనా పని ఉందేమో అనుకున్నా..! ఇన్నాళ్లూ మురిపెంగా చూసుకుంటూ.. ముద్దాడిన నువ్వు.. ఇంత విషాన్ని కడుపులో దాచుకున్నావంటే.. నమ్మలేకున్నా నాన్నా..! బావి గట్టున దించి.. నీటిలోకి దూకెయ్.. ఈత నేర్పిస్తా.. అంటివి..! భయం వేస్తోంది నాన్నా అని.. ఎంతగా ఏడ్చాను..? నిర్దాక్షిణ్యంగా అలా నీటిలో పడేసి చంపేశావే..? నువ్వు మనిషివేనా నాన్నా..? మనిద్దర్నీ పక్కపక్కనే చూసిన అందరూ.. నాది అచ్చూ నీ పోలికే అంటున్నారు. కూతురికి తండ్రి పోలిక వస్తే అదృష్టం అంటారు కదా..? మరి నాకెందుకు ఇలా జరిగింది నాన్నా..? చిన్న పిల్లని..! ఈ పాడుబడ్డ బావి నుంచి నా మృతదేహాన్ని వెలికి తీసేదాకా.. మూడు రోజులపాటు ఎంతగా భయపడ్డానో తెలుసా నాన్నా..?


(వివరాలు మెయిన్‌లో..)


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


శోకసంద్రంలో తల్లి

అతిసారతో జాగ్రత్త

● సీజనల్ వ్యాధులను నియంత్రించండి ● కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్


సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జూన్ 22: జిల్లాలో అతిసార ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య, పంచాయతీ, జడ్పీ, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల అధికారులతో శనివారం సీజనల్ వ్యాధుల నియంత్రణపై ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామ, పట్టణ, నగర ప్రాంతాలలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సూచించిందని అన్నారు. అతిసారపై మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ వ్యాధి ఎలా సంక్రమిస్తుందో ప్రజలకు అవగాహన కల్పించాలని, వారు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని అన్నారు. అతిసార ప్రబలే ప్రమాదం ఉన్న ప్రాంతాల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. అక్కడ తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆస్పత్రులకు వచ్చే కేసుల వివరాలు తీసుకుని, ఆ ప్రాంతాలకు వెళ్లాలని, బ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, మంచినీటి ట్యాంకులను ఎప్పటికపుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పరిశుభ్రతను విధిగా పాటించాలని సూచించారు. నాణ్యమైన భోజనం, తాగునీరు పిల్లలకు అందేలా చూడాలని అన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగేలా అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆగస్టు నెల వరకూ అతిసార, విష జ్వరాల గురించి ప్రజలకు అవగాహన పెంచుతూ, వారు అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని, వ్యాధులు ప్రబలకుండా నియంత్రించాలని ఆదేశించారు. సమీక్షలో జడ్పీ సీఈఓ వైకోమ్ నిదియా, నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, డీపీఓ ప్రభాకరరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, మున్సిపల్ ఆర్డీ పీవీఎస్ఎస్ మూర్తి, డీఐఓ డాక్టర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడేమంటారు?

బోగస్ మస్టర్లతో రూ. కోట్లు దోపిడీ

కూలీల పొట్టకొట్టిన డ్వామా సిబ్బంది

ఉపాధి సొమ్ము వాటాలుగా పంపకాలు

జేబులు నింపుకున్న కొందరు అధికారులు, వైసీపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 22: కూలీలకు అందాల్సిన ఉపాధి సొమ్మును కొందరు స్వార్థపరులు బోగస్ మస్టర్ల ద్వారా తమ జేబుల్లో వేసుకున్నారు. జిల్లాలోని జాబ్‌కార్డులు, కూలీల ఆధారంగా 2 కోట్ల పనిదినాలు కల్పించాల్సి ఉంది. అయితే జిల్లాకు 90లక్షలు పనిదినాలు మాత్రమే కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు 61.30లక్షలు పనిదినాలు పూర్తి చేశారు. ఇందులో బోగస్ మస్టర్ల ద్వారా సుమారు 5లక్షల పనిదినాలు నమోదు చేసినట్లు సమాచారం. ఒక్కో పనిదినానికి రూ.220 చొప్పున 5 లక్షల పనిదినాలకు రూ.11కోట్లను ఉపాధి సిబ్బంది, గత వైసీపీ ప్రభుత్వంలోని కొందరు ప్రజా ప్రతినిధులు వాటాలుగా పంచుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి కూలీలకు దక్కాల్సిన రూ.11కోట్లు నిధులను కొందరు డ్వామా అధికారులు, ఉపాధి సిబ్బంది, వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు తమ జేబుల్లో వేసేసుకున్నారు. అంటే బోగస్ మస్టర్ల నమోదు ఏస్థాయిలో జరిగిందో ఊహించుకోవచ్చు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 కనీస వేతనం పడాల్సిన పరిస్థితుల్లో బోగస్ మస్టర్లతో రూ.220 మాత్రమే పడుతోంది. దీంతో రోజకు ఉపాధి కూలీకి రూ.80 నష్టం జరుగుతోంది. బోగస్‌మస్టర్ల నమోదును అడ్డుకోవాల్సిన డ్వామా అధికారులతో పాటు జిల్లా యంత్రాంగం నిద్రమత్తులో జోగుతోంది. నిఘా విభాగం అధికారులు మామూళ్ల దెబ్బకు నోరు కట్టేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి ఉన్నతాధికారులు దీనిపై ఏమంటారో, ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని పలువురు కూలీలు ఎదురు చూస్తున్నారు.




డ్వామా పీడీ కార్యాలయం


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కుందుర్పిలో తక్కువ పనిదినాలు

ఈ ఏడాదికి సంబంధించి ఉపాధి పనిదినాలు కుందుర్పి మండలంలో అత్యల్పంగా నమోదయ్యాయి. ఈ మండలంలో 84వేలు పనిదినాలు పూర్తి చేశారు. జూన్ మాసానికి ఈ పాటికి కనీసం 3లక్షలు ప్రతి మండలంలో పని దినాలు పూర్తి చేయాల్సి ఉంది. అయితే గుంతకల్లు, పెద్దవడుగూరు, నార్పల, యల్లనూరు మండలాలు మినహా ఏ ఒక్క మండలంలోనూ 3 లక్షల పనిదినాలు పూర్తి కాలేదు. వెనుకబడిన మండలాల్లో పనులు కల్పించడంలో డ్వామా అధికారులు, ఉపాధి సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. ఒకవేళ పని కల్పించినా బోగస్‌మస్టర్ల నమోదుతో ఉపాధి కూలీల పొట్టకొడుతున్నారు. ఎక్కువ పనిదినాలు నమోదు చేసిన మండలాల్లోనే బోగస్ మస్టర్లు, ఉపాధి నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


గిట్టుబాటు కావడం లేదు



ఉపాధి పనులకు వెళ్తున్నా... పనికి తగిన కూలి గిట్టుబాటు కావడం లేదు. ఇప్పటికే పలుమార్లు ఉపాధి అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదు. ఎంతపని చేసినా ఒక్కటే కూలి ఇస్తున్నారు. పెంచాలని అడిగిన పట్టించుకునే నాథుడే లేడు. ముఖ్యంగా పనిచేసే చోట తాగునీరు, నీడ, మజ్జిగ వసతులు కల్పించి, పనిముట్లు ఇవ్వాలి. సుమారు నాలుగైదేళ్లుగా పనిముట్లు ఇవ్వడం లేదు. సొంతంగా పని ముట్లు తెచ్చుకుని పనిచేసినా కూలి గిట్టుబాటు కావడం లేదు.

- విజయలక్ష్మి, ఉపాధి కూలీ, విడపనకల్లు


విచారణ జరిపించాలి



ఉపాధి పనుల్లో జరుగుతున్న బోగస్ మస్టర్ల అక్రమాలపై విచారణ జరిపించాలి. బాధ్యులైన ఉపాధి సిబ్బంది, డ్వామా అధికారులపై చర్యలు తీసుకోవాలి. పెండింగ్‌లో ఉన్న నెల రోజుల ఉపాధి కూలీల వేతనాలు రూ.10కోట్లు వెంటనే చెల్లించాలి. అధిక కూలి గిట్టేలా ఉపాధి సిబ్బంది పనులు కల్పించాలి. బోగస్ మస్టర్లను నియంత్రిస్తే కూలీలకు కనీస గిట్టుబాటు కూలి దక్కుతుంది.

- కేశవరెడ్డి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

వంద రోజుల పని కల్పనే లక్ష్యం



ఉపాధి పనుల్లో బోగస్ మస్టర్ల నమోదుకు అవకాశం లేదు. బోగస్ మస్టర్లు ఎక్కడైనా నమోదైనట్లు మా దృష్టికి వస్తే...బాధ్యులైన సిబ్బందిపై కచ్చితంగా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించి జాబ్‌కార్డుదారుల వలసలను నివారించడానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం.. ప్రతి మండలంలో కేటాయించిన పనిదినాలు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఇప్పటికే సూచించాం. ప్రతి కూలీకి గిట్టుబాటు వేతనం పడేలా పనులు చేయిస్తున్నాం. జాబ్‌కార్డుదారులందరికీ వంద రోజుల పని దినాలు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం.

- వేణుగోపాల్ రెడ్డి, డ్వామా పీడీ

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం టౌన్, జూన్ 22 : సుభాష్ చంద్రబోస్ పురస్కారాలు 2025 సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ శనివారం ప్రకటించారు. విపత్తు నిర్వహణ రంగంలోని వ్యక్తులు, సంస్థలు చేసిన అద్భుతమైన కృషిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం సుభాష్ చంద్రబోస్ పురష్కారం పేరుతో ఏటా జనవరి23 తేదీన అందజేస్తుందన్నారు. ఎంపికైన వ్యక్తికి లేదా సంస్థకు రూ.5లక్షల నగదు అందజేస్తారన్నారు. జూలై 1వతేదీనుంచి ఆగస్టు 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

జీఓ 117 రద్దుతోనే విద్యావ్యవస్థ మెరుగు

అనంతపురం విద్య, జూన్ 22 : రాష్ట్రంలో విద్యావ్యవస్థ బాగుపడాలంటే... 117 జీఓ రద్దు చేయాలని ఏపీఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అనాలోచితంగా విడుదల చేసిన 117 జీఓ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6,7,8 తరగతులను హై స్కూళ్లలో విలీనం చేశారన్నారు. దీంతో ఎస్‌జీటీ పోస్టులు వేల సంఖ్యలో రద్దు అయ్యాయని, డీఎస్సీలో టీచర్ పోస్టులు తగ్గాయన్నారు. అంతేకాకుండా తరగతి గదులు సైతం నిర్వీర్యం అయ్యాయని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 117 జీఓను రద్దు చేసి స్కూళ్లకు పూర్వవైభవం తేవాలని కోరారు.

'శ్రేష్ఠ' ప్రవేశ పరీక్షలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 22 : దేశవ్యాప్తంగా నిర్వహించిన 'శ్రేష్ఠ' ప్రవేశ పరీక్షలో జిల్లాలోని అంబేద్కర్ గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు గురుకులాల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాయగా... 80 మంది ఎంపికయ్యారన్నారు. వారిలో 30 మంది విద్యార్థులకు 3 వేల లోపు ర్యాంకు వచ్చిందన్నారు. వీరిలో బి.పప్పూరు గురుకులం నుంచి 2, హిందూపురం బాలుర గురుకులం నుంచి 7, కురుగుంట గురుకులం నుంచి 18, హిందూపురం బాలికల గురుకులం నుంచి 3, కొర్రపాడు గురుకులం 4, తిమ్మాపురం 1, మలుగూరు 1, ఉరవకొండ 4, అమరాపురం 3 విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, విద్యార్థులకు తోడ్పాటునందించిన ఆయా గురుకులాల ప్రిన్సిపాల్స్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

రేపు ఉద్యోగమేళా

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 22: ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఈనెల 24వతేదీన ఆర్టీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో రిలేషన్‌షిప్ ఆఫీసర్, సీనియర్ ఆర్‌ఓలుగా పనిచేసేందుకు అభ్యర్థులు అవసరమన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు వేతనంతో పాటు అన్ని కలిపి రూ.20వేలు వరకు చెల్లిస్తామన్నారు. ఇంటర్ చదివి 20-30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సోమవారం ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆధార్, డ్రైవింగ్‌లైసెన్సు, బ్యాంకు అకౌంట్ పాసుపుస్తకం, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9550676098, 8328528338లను సంప్రదించాలని కోరారు.


చీనీ కాయలు టన్ను రూ.32వేలు

అనంతపురంరూరల్, జూన్22: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు 819టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నష్టాల పాలు.!



- ఆవు పాల ధరలు తగ్గించేశారు
- డిమాండ్ తగ్గిందంటున్న ప్రైవేట్ డెయిరీలు
- లీటరుకు రూ.5 కోత
- మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి అధికంగా ఉత్పత్తి
- నష్టాలు తప్పవంటున్న పాడి రైతులు



రాప్తాడు, జూన్ 22: నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి.. కరివేపాకు నుంచి కారం పొడి దాకా ధరలు భగ్గుమంటున్నాయి. కానీ పాడి రైతులు కష్టపడి ఉత్పత్తి చేసిన ఆవు పాల ధరలు మాత్రం తగ్గించేశారు. పాలు అధికంగా వస్తున్నాయి.. డిమాండ్ లేదని, డెయిరీ నిర్వాహకులు అంటున్నారు. దీంతో రైతులకు ఆందోళనే మిగులుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆవు పాల ధరలు తగ్గించేశారు. ప్రైవేటు డెయిరీలు లీటరు పాలపై రూ.5 తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. జిల్లాలో పాడి ఆవులు అధికంగా ఉన్నాయని, పాల ఉత్పత్తి పెరిగిందని, ఇతర రాష్ట్రాల పాలు తక్కువ ధరకే సరఫరా అవుతున్నాయనే కారణంతో పాల ధరలు తగ్గించేశారు. అయితే పాల ధరలు తగ్గిస్తే పశువులనే నమ్ముకుని జీవనం సాగించే రైతులు గిట్టుబాటు కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాణా ధరలు, రవాణా చార్జీలు పెరిగినా పాల ధరలు తగ్గించడం అన్యాయమని వాపోతున్నారు. డెయిరీ నిర్వాహకులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా అయితే నష్టాల పాలు కాక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాప్తాడులో షెడ్‌లో ఉన్న పాడి ఆవులు

లీటరుకు రూ. 5 వరకూ తగ్గించారు



: గేటు సత్తి, రైతు గంగలకుంట

మాది వ్యవసాయ కుటుంబం. వ్యవసాయం, పాడి పరిశ్రమపైనే జీవనం సాగిస్తున్నాం. 4 పాడి ఆవులు ఉన్నాయి. రోజూ 30 లీటర్ల పాలు ప్రైవేటు డెయిరీకి పోస్తాం. ప్రతి 15 రోజులకు లేదా 10 రోజులకు ఒకసారి బిల్లు చెల్లిస్తారు. ఇది వరకూ ఆవు పాలు నాణ్యత బట్టి లీటరుకు 35 నుంచి 40 వరకూ చెల్లించేవారు. ప్రస్తుతం పాల దర లీటరకు రూ. 5 వరకూ తగ్గించారు. పాడి పశువులకు ఉపయోగించే దాణా ధరలు పెరిగి పోయాయి. పాల ధరలు మాత్రం తగ్గిస్తే ఎలా.?. దీనిపై డెయిరీలు ఆలోచించాలి.

గిట్టుబాటు కాదు



: ఉజ్జినప్ప రైతు, గొందిరెడ్డిపల్లి

నాకు 6 పాడి ఆవులు ఉన్నాయి. రోజూ 40 లీటర్ల పాలు ఓ ప్రైవేటు డైరీకి పంపుతాను. ప్రస్తుతం లీటరుపై రూ. 5 వరకూ తగ్గించారు. వేలకు వేలు పెట్టి కొన్న పాడి ఆవులను మేపడం ఎలా..పాల ధరలు తగ్గిస్తే రైతులకు గిట్టుబాటు కాదు.

సాగు సాధ్యం కాకే.. పాడి వైపు..

పంటల సాగుకు పెట్టుబడులు ఎక్కువ కావడం, పంట చేతికందే సమయంలో అతివృష్టి, అనావృష్టి, గిట్టుబాటు దర లేకపోవడం తదితర కారణాల వలన రైతులు నష్టాలతో అప్పుల పాలవుతున్నారు. వ్యవసాయం భారమవుతున్న తరుణంలో జిల్లాలో అనేక మంది రైతులు పాడి పశువుల పెంపకంపై దృష్టి సారించారు. పాడి ఆవులు కొనుగోలు చేసి పాల ఉత్పత్తి ద్వారా వచ్చిన డబ్బుతో పిల్లల చదువులు, జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 4.97 లక్షల పాడి ఆవులు ఉన్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. రోజూ దాదాపు 30 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. పాలను ఎక్కువగా ప్రైవేటు డైయిరీలే సేకరిస్తున్నాయి. జిల్లాలోని పలు ప్రైవేటు డెయిరీలు ఇప్పటికే పాల ధరలు లీటరుపై రూ. 5 తగ్గించారు. మరికొన్ని ప్రైవేటు డెయిరీలు ఈనెల 20 నుంచి పాల ధరలు తగ్గించారు. పరిమితికి మించి పాలు ఎక్కువగా వస్తున్నాయని అందువలన రేటు తగ్గించాల్సి వస్తోందని డెయిరీ యజమానులు చెబుతున్నారు. మహరాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి పాలు ఇక్కడికి దిగుబడి అవుతున్నాయి. దానికి తోడు స్థానికంగా కూడా పాల ఉత్పత్తి అధికంగా పెరిగింది. దీంతో ధరలు తగ్గించాల్సి వస్తోందని డెయిరీ యజమానులు ఏజెంట్లకు చెబుతున్నారు. అయితే ప్రైవేట్ డెయిరీ యజమానులందరూ సిండికేట్ అయ్యి పథకం ప్రకారం పాల దరలు తగ్గించారని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

దాణా, ఆవుల ధరలూ అధికమే

ఒక పాడి ఆవు కొనుగోలు చేయాలంటే రూ. 50 వేల నుంచి లక్ష వరకూ ఖర్చు చేయాల్సి ఉంటుంది. పశువులకు మేత, దాణాలైన నూక, బిస్కెట్, వడియాలు, బుస, పొప్పిలిపిండి ఇతర దాణాలు రేట్లు అధికంగా ఉన్నాయి. పాడి పశువును పోషించాలంటే అధికంగా ఖర్చవుతుంది. లీటరు ఆవు పాలకు రూ. 40 ఇస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. గత 15 రోజుల వరకు పాల నాణ్యతను బట్టి లీటరుకు రూ. 35 నుంచి 40 వరకూ రైతులకు చెల్లించారు. ప్రసుత్తం ధరలు తగ్గించడంతో కొన్ని డెయిరీలు ఇప్పటికే తగ్గిన ధరల ప్రకారం రైతులకు చెల్లిస్తున్నారు.

పాలు పంపొద్దంటున్నారు : ఆది డెయిరీ ఏజెంట్



నేను ప్రతి రోజు దాదాపు 1400 లీటర్లు పాలు రైతుల నుంచి సేకరించి ఓ ప్రైవేటు డెయిరీకి పంపిస్తాను. 10 రోజులకు ఒకసారి రైతులకు పాల బిల్లు చెల్లిస్తా. పాల దిగుబడి పెరిగిందని, ప్రస్తుతం డెయిరీకి పంపుతున్న పాల కంటే ఎక్కువ పాలు పంపద్దని డెయిరీ యజమానులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పాలు ఎక్కువగా అధికంగా సరఫరా అవుతున్నాయని, ఆ పాలు ఇక్కడ పాలకు ఇచ్చే ధర కంటే తక్కువ ధరకే ఇక్కడికి పంపుతున్నారన్నారు. రైతుల పాలు వద్దనలేక ఏజెంట్లు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో డెయిరీ ఏజెంట్లు పాలు సేకరించడం మానేస్తున్నారు.

పోలీసులనే డబ్బులు అడుగుతావా..?

- అర్ధరాత్రి నకిలీ పోలీసుల హంగామా
- డాబాలో బిల్లు కట్టమన్నందుకు మహిళపై దాడి
- పోలీసుల రాకతో పరార్

రాప్తాడు, జూన్ 22: 'మేము..పోలీసులం మమ్మల్నే బిల్లు కట్టమంటావా?' అంటూ డాబా నిర్వాహకులపై బెదిరింపులకు దిగారు. అడ్డు వచ్చిన మహిళపైనే దాడికి దిగారు. నకిలీ పోలీసులు.. మందేసి నానా యాగీ చేశారు. డాబా వద్ద అర్ధరాత్రి హల్ చల్ చేశారు. డాబా యజమాని, అసలైన పోలీసులు అక్కడికి రావడంతో నకిలీ పోలీసులు కారులో వెళ్లిపోయారు. వివరాలు ఇలా.. రాప్తాడు సమీపం ప్రసన్నాయపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ డాబాకు శుక్రవారం అర్ధరాత్రి వీఆర్‌లో ఉన్న ఓ కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరు ఏపీ39జేఎఫ్ 2766 కారులో వచ్చారు. అప్పటికే వారు మద్యం తాగి ఉన్నారు. డాబాలో ఫుడ్ ఆర్డర్ చేసి కావల్సినంత తిన్నారు. బిల్లు కట్టమంటే తాము పోలీసులమని (వీఆర్ కానిస్టేబుల్ తోపాటు వచ్చిన ఇద్దరు) బిల్లు కట్టేది లేదని దబాయించారు. డాబా సిబ్బందిని బూతులు తిట్టారు. తినగా మిగిలిన ఆహారాన్ని వారిపై విసిరి నానా యాగీ చేశారు. 'తిన్నారు కదా? బిల్లు కట్టాల్సిందే' అని నిలదీయడంతో తనపై దాడి చేశారని బాధిత మహిళ వాపోయింది. అక్కడ ఉన్న వారు రాప్తాడు పోలీసులకు ఫోన్ చేయడంతో స్టేషన్‌లో ఉన్న ఓ కానిస్టేబుల్ అక్కడికి వచ్చాడు. డాబాలో పని చేసే సిబ్బంది, యజమాని అక్కడికి వచ్చి 'మీరు ఏ స్టేషన్ పోలీసులు? ఏ ఊరు మీది? ఎక్కడి నుంచి వచ్చారు?' అని నిలదీయడంతో వారు వెంటనే కారులో ఎక్కారు. అక్కడున్న వారు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఎక్కువ మంది గుమిగూడటంతో వారు కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. రాప్తాడు సీఐ మునిస్వామి శనివారం ఉదయం డాబా వద్దకు వెళ్లి ఘటనపై ఆరా తీశారు.



పోలీసునంటూ హల్ చల్ చేసిన వ్యక్తి



వారు వచ్చింది ఈ కారులోనే..

టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ

తాడిపత్రిటౌన్, జూన్22: మండలంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య నీటి విషయంలో ఘర్షణ జరిగింది. బ్రాహ్మణపల్లికి గ్రామం వైసీపీ నాయకులు చెన్నారెడ్డి, టీడీపీకి చెందిన ఖాదర్‌బాషా, కతాలప్పలు శనివారం రాత్రి ఘర్షణ పడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి నీరు టీడీపీకి చెందిన కతాలప్ప ఇంటి వద్ద నీరు నిలబడ్డాయి. వైసీపీకి చెందిన చెన్నారెడ్డి ఇంటివద్ద రోడ్డు ఎత్తుగా ఉండడంతో నీరంతా వచ్చి తమ ఇంటివద్ద నిలబడుతోందని కతాలప్ప చెన్నారెడ్డితో వాగ్వాదానికి దిగాడు. మాటమాటా పెరగడంతో కతాలప్పతోపాటు మహబూబ్‌బాషా, హుస్సేన్, ఖలీల్‌తోపాటు మరికొంతమంది కలిసి చెన్నారెడ్డి, రాజమోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలపై దాడిచేశారు. చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.



కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చిస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్

ప్రీ బడ్జెట్ సమావేశానికి హాజరైన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల

అనంతపురం అర్బన్, జూన్ 22 : న్యూఢిల్లీలోని భారత్ సమ్మిట్ రూమ్‌లో ప్రీ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నిర్వహించిన ఈ సమావేశంలో పలు రాష్ట్రాల ఆర్థిక శాఖా మంత్రులు పాల్గొన్నారు. సమావేశానికి రాష్ట్రం తరుపున ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- ముగ్గురికి గాయాలు

గుత్తిరూరల్, జూన్ 22: మండలంలోని కొత్తపేట గ్రామశివారు 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విష్ణు(4) అనే బాలుడు మృతి చెందాడు. శనివారం తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా పెన్నాగరం గ్రామానికి చెందిన కార్తీక్, భార్య సత్య, కుమారుడు విష్ణు, బావమరిది మోహన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తున్నారు. కొత్తపేట గ్రామా శివారులోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విష్ణు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కార్తీక్ హైదరాబాద్‌లో హాట్ చిప్స్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



మృతి చెందిన విష్ణు..రోదిస్తున్న తల్లిదండ్రులు

జాతీయ పోటీలకు రెఫరీగా రామాంజనేయులు



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 22: జిల్లా తైక్వాండో కోచ్‌కు అరుదైన గౌరవం దక్కింది. తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, అస్సోం తైక్వాండో ఫెడరేషన్ సంయుక్తంగా 24వ తేదీ నుంచి అస్సోంలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. పోటీలకు తైక్వాండో జిల్లా కోచ్ మల్లెల రామాంజనేయులు చీఫ్ రెఫరీగా ఎంపికయ్యారు. ఆయనను జిల్లా క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు.

సైకిల్‌పై కళ్యాణదుర్గం నుంచి అమరావతికి..

- అమిలినేని సురేంద్రబాబుపై అభిమానంతో 520 కిలోమీటర్లు సైకిల్ తొక్కిన టీడీపీ కార్యకర్త

కళ్యాణదుర్గం, జూన్ 22 : రాష్ట్రంలో టీడీపీ పాలన రావాలని, చంద్రబాబు సీఎం కావాలని ఆకాంక్షించడమే కాకుండా ఎమ్మెల్యేగా అమిలినేని సురేంద్ర బాబు విజయం సాధించడంతో అతను అభిమానాన్ని చాటుకున్నారు. కళ్యాణదుర్గం నుంచి అమరావతి వరకు ఓ అభిమాని సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాడు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన రాయలసీమ రామన్న వారం రోజుల క్రితం కళ్యాణదుర్గం నుంచి సైకిల్ తొక్కుకుంటూ వెళ్లి శనివారం అమరావతి చేరుకున్నారు. అమిలినేని సురేంద్రబాబుపై అభిమానంతో 520 కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ అమరావతికి చేరానని తెలిపారు. చంద్రన్న పాలన రావాలని కోరుకున్నానని, నెరవేరడంతో సైకిల్ తొక్కుకుంటూ వెళ్లానన్నారు.



అమరావతికి సైకిల్‌పై వెళ్లిన రాయలసీమ రామన్న

జేఎన్‌టీయూ విద్యార్థుల ప్రతిభ విశ్వవ్యాప్తం

- రిజిస్ట్రార్ శశిధర్

అనంతపురం సెంట్రల్, జూన్ 22: జేఎన్‌టీయూలో సాంకేతిక విద్యనభ్యసించిన విద్యార్థులు విశ్వవ్యాప్తంగా ప్రతిభను చాటి జిల్లాకు ఖ్యాతిని గడిస్తున్నారని వర్సిటీ రిజిస్ట్రార్ శశిధర్ ప్రశంసించారు. శనివారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల 1994-98 విద్యా సంవత్సరం బీటెక్ పూర్తిచేసిన అన్ని బ్రాంచ్(కోర్సు)ల విద్యార్థులు సిల్వర్ జూబ్లీ రీయూనియన్ ఉత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ రజిత అధ్యక్షత వహించారు. రిజిస్ట్రార్ శశిధర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, ప్రొఫెసర్ క్రిష్ణయ్య, మాజీ వీసీ వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు జిల్లాగా పేరొందిన అనంతపురం జేఎన్‌టీయూ ఏర్పాటు చేయడం ఈ ప్రాంత విద్యార్థులకు వరంగా మారిందన్నారు. ఏడు దశాబ్దాలకుపైగా లక్షలాదిమంది విద్యార్థులు ఇక్కడ ఇంజనీరింగ్ పూర్తిచేసి ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడ్డారని హర్షం వ్యక్తం చేశారు. 1994-98 బ్యాచ్ విద్యార్థులు వివిధ దేశాల్లో కార్పొరేట్ సంస్థలు ఏర్పాటుచేసి అనేకమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఆయా బ్రాంచ్‌ల విద్యార్థులు వారి విభాగాధిపతులను ఘనంగా సత్కరించి తరగతుల జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు భారతి, మమత, కళ్యాణిరాధ, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దిలీప్‌తోపాటు పూర్వపు విద్యార్థులు డాక్టర్ రమేష్, అశోక్, కిరణ్‌కుమార్, అనీల్, రామకృష్ణ, ప్రసాద్, సతీష్, చంద్రమౌళి, హరి, మిథున్, మణీష్, పంత్వార్, మల్లికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో రిజిస్ట్రార్, విభాగాధిపతులు

స్పీకర్‌కు పరిటాల సునీత శుభాకాంక్షలు



అనంతపురం అర్బన్: ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడును మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం విజయవాడలో స్పీకర్‌ను ఆమె కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

హోంమంత్రి, స్పీకర్‌కు దగ్గుపాటి..





ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితలను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు తెలుగు మహిళలు



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను తెలుగు మహిళలు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం విజయవాడలోని ఆయన నివాసంలో మాజీ మేయర్ స్వరూప, టీడీపీ గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షిలు మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు.

డిప్యూటీ సీఎం పవన్‌కు జనసేన నాయకులు..



అనంతపురం ప్రెస్‌క్లబ్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు జిల్లాకు చెందిన ఆ పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా సమస్యల గురించి పవన్‌కల్యాణ్ ఆరా తీసినట్లు వారు తెలిపారు. జిల్లాలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.

విద్య, ఐటీ శాఖకు నారా లోకేశ్ వన్నెతెస్తారు

టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

పరిటాల శ్రీరామ్‌ను సన్మానించిన నారాలోకేశ్



పరిటాల శ్రీరామ్‌ను సన్మానిస్తున్న నారాలోకేశ్

అనంతపురం అర్బన్, జూన్ 22: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖలకు వన్నెతెస్తారని ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారాలోకేశ్‌ను పరిటాల శ్రీరామ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువ కప్పి సన్మానించే ప్రయత్నం చేయగా నారాలోకేశ్ తిరిగి పరిటాల శ్రీరామ్‌కు శాలువ కప్పి సన్మానించారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో నారాలోకేశ్ మంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆయనకు కీలక శాఖలు అప్పగించడం శుభపరిణామమన్నారు. తనకు అప్పగించిన శాఖల బాధ్యతలు సవ్యంగా నిర్వర్తించి, యువత భవిష్యత్‌ను మార్చేందుకు అడుగులు వేయడంతోపాటు పార్టీని సమర్థవంతంగా ముందుకు తీసుకువెళతారన్నారు.

జామియా మసీదు ముతవల్లులుగా షఫివుల్లా, షకీల్ షఫీ



షఫీవుల్లా, షకీల్ షఫీలను సత్కరిస్తున్న టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

అనంతపురం కల్చరల్, జూన్ 22: అనంతపురం జామియా మసీదులు, వాటి అనుబంధ వక్ఫ్ సంస్థల ముతవల్లీలుగా కేఎం షఫీవుల్లా, కేఎం షకీల్‌షఫీ నియమితులయ్యారు. శనివారం వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షాషావలి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకులు, ముస్లింలు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ముస్లి మైనార్టీ నాయకులు షౌకత్ ఖాన్, బాషా, షేక్ నూర్ తదితరులు పాల్గొన్నారు.

రీజినల్ మేనేజర్‌కు శుభాకాంక్షలు



ఆర్‌ఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎంలు

అనంతపురం కల్చరల్, జూన్ 22: ఆర్టీసీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అనంత ఆర్టీసీని రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిపినందుకుగాను ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్న అనంతపురం రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోనికి డీఎంలు శుభాకాంక్షలు తెలిపారు. రీజియన్‌లోని అన్ని డిపోల మేనేజర్లు శనివారం సాయంత్రం ఆర్‌ఎం సుమంత్ ఆర్ ఆదోనిని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ అందరి కృషివల్లే ఫలితాలు సాధించగలిగామని, భవిష్యత్‌లో మరింత కష్టపడి అనంతపురం రీజియన్‌ను లాభాలబాటలో పయనింపజేసేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం రమేష్‌బాబు, లా ఆఫీసర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.





ప్రదర్శన ఇస్తున్న వివిధ ప్రాంతాల కళాకారులు

నాట్యానందం



ప్రసంగిస్తున్న సంధ్యామూర్తి

వివిధ రాష్ట్రాల నుంచి కళాకారులు హాజరు

అలరించిన 'సంధ్యారవళి'



దేశంలోని వివిధ రాష్ట్రాల సంస్కృతులకు చెందిన నాట్య ప్రదర్శనలను ఒకే వేదికపై తిలకించి అనంతవాసులు పులకించిపోయారు. శ్రీ నృత్యకళానిలయం ఆధ్వర్యంలో శనివారం స్థానిక టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించిన 'సంధ్యా రవళి'కి తెలుగు రాష్ట్రాలతోపాటు రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక నుంచి దాదాపు 250 మంది కళాకారులు నాట్యప్రతిభను చూపారు. ప్రదర్శనల అనంతరం నాట్యగురువులకు నాట్య భారతి, నాట్య కళాకారులకు నాట్య తులసి పురస్కారాలను ముఖ్య అతిథులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, టీటీడీ కల్యాణమండపం సుధాకర్‌రెడ్డి, కేవీ రమణ, సుంకు వేణుగోపాల్, అంబటి ఫణిరాజ్, ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

- అనంతపురం కల్చరల్



ఒకే వేదికపై తల్లి విజయలక్ష్మి, కూతురు తన్వి నాట్యం

డీఎస్‌డీఓపై కలెక్టర్ ఆగ్రహం

డీఎస్ఏలో ఏం జరుగుతోంది..?

క్రీడాసామగ్రి మాయం కావడం ఏంటి..?

మీరు ఏం చేస్తున్నారంటూ క్లాస్

రహస్యంగా వివరాలు సేకరించిన శాప్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఇండోర్ స్టేడియంలో ఫిష్ ఆంధ్రాపై ప్రచారం చేస్తున్న డీఎస్‌డీఓ షఫీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 22: డీఎస్‌డీఓ ఆగడాలపై ఇటు కలెక్టర్ వినోద్‌కుమార్, అటు శాప్ ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'జనం సొమ్ము జేబులోకి.. పిల్లల సొమ్ము, ఎన్నికల నిధులతో డీఎస్‌డీఓ జల్సాలు' కథనానికి కలెక్టర్, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఉన్నతాధికారులు స్పందించారు. కలెక్టర్ శనివారం డీఎస్‌డీఓను పిలిపించుకుని డీఎస్ఏలో ఏం జరుగుతోంది..? మీరు ఏం చేస్తున్నారు..? ఇండోర్‌స్టేడియంలో జనరేటర్, అకాడమీలకు సంబంధించిన క్రీడా సామగ్రి మాయమవడం ఏంటి..? తదితర విషయాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇదే సందర్భంలో డీఎస్‌డీఓపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అటు శాప్ ఉన్నతాధికారులు పలువురి నుంచి డీఎస్ఏలో జరుగుతున్న వ్యవహారాలపై వివరాలు రహస్యంగా సేకరించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా శుక్రవారం సాయంత్రం అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫిష్ ఆంధ్రాపై బహిరంగంగా ప్రచారం నిర్వహించి జగన్‌పై ఉన్న స్వామి భక్తిని డీఎస్‌డీఓ చాటుకున్నారు. మునుపెన్నడూ ఇండోర్‌స్టేడియంలో ఇలా ఫిష్ ఆంధ్రా, ఇతర అంశాలపై బహిరంగంగా ప్రచారం నిర్వహించిన దాఖలాలు లేవని, ఇదేమి కొత్త సంస్కృతి అంటూ పలువురు సీనియర్ క్రీడాకారులు, మాజీ డీఎస్ఏ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కల పెంపకంతో పచ్చదనం

సమగ్రశిక్ష ఏపీసీ వైభోమ్ నిదియాదేవి



మొక్కలు నాటుతున్న ఏపీసీ నిదియాదేవి

అనంతపురం విద్య, జూన్ 22: మొక్కల పెంపకంతో పచ్చదనం సాధ్యమని, అది పర్యావరణానికి ఎంతగానో తోడ్పడుతుందని ఏపీసీ వైభోమ్ నిదియాదేవి అన్నారు. శనివారం సమగ్రశిక్ష ప్రాజక్టు కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఏపీసీ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలునాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కరువు జిల్లాగా మారిన అనంతపురంలో విరివిగా మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకం పెద్దఎత్తున చేపట్టడంతోనే కరువు నివారణ సాధ్యమని సూచించారు. మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టులోని పలు విభాగాల అధికారులు, సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్‌స్టాప్ సౌకర్యం కల్పించండి

ఏపీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్‌కు మాజీ సైనికుల వినతి



డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ సైనికులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 22: కూడేరు మండలం గొట్కూరు వద్ద ఉన్న సైనికపురానికి ఆర్టీసీ బస్సు స్టాప్ సౌకర్యం కల్పించాలని ఏపీఎస్‌ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూపాల్‌ను మాజీ సైనికులు కోరారు. శనివారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు షేకన్న ఆధ్వర్యంలో పలువురు మాజీ సైనికులు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం షేకన్న మాట్లాడుతూ సైనికపురం వద్ద బస్సు స్టాప్ సౌకర్యం లేకపోవడంతో అక్కడ ఉన్న మాజీ సైనికులు అనంతపురం రావడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పట్నం ఉమామహేశ్వరరావు, కోశాధికారి తిమ్మారెడ్డి, మాజీ సైనికులు మాస్టర్ వారెంట్ ఆఫీసర్ బషీర్‌అహ్మద్, మణికుమార్, బీఏ హుస్సేన్, ఇస్మాయిల్ షఫి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం కల్చరల్, జూన్ 22: ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్‌కు సంబంధించి జైభీమ్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. కళ్యాణదుర్గం రోడ్డులోని ఆ అసోసియేషన్ కార్యాలయం వద్ద రాష్ట్ర అధ్యక్షుడు ప్రత్తిపాటి కిరణ్ బుజ్జి, చీఫ్ అడ్వైజర్ బాబన్న సమక్షంలో ఎన్నిక ప్రక్రియ సాగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా నూలు దామోదర్, కార్యదర్శిగా వెంకటేశులు, కోశాధికారిగా కేపి పుల్లన్న, ప్రచార కార్యదర్శిగా ఓబయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా ఎర్రిస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జైభీమ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సుధాకర్, జోనల్ నాయకులు ముత్యాలు, సీనియర్ నాయకులు నాగన్న, డీఎస్ మన్యం పాల్గొన్నారు.

నష్టపరిహారం వెంటనే అందించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

అనంతపురం టౌన్, జూన్ 22: తాడిపత్రి జాతీయ రహదారి ఏర్పాటుతో నష్టపోయిన బుక్కరాయసముద్రం మండలం బోడిగాని దొడ్డి గ్రామస్థులకు చట్టప్రకారం నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నష్టపరిహారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడిగానిదొడ్డి గ్రామంలో సర్వేనెంబరు 112-2లో 0,60ఎకరాల భూమికి అవార్డు అయ్యాక పరిహారం ఇవ్వలేదన్నారు. పట్టాదారులకు నష్టపరిహారం అందించేందుకు సమావేశం పెట్టి భూమి, ఇళ్లు కోల్పోయిన వాళ్లకు ఏమికావాలో తెలుసుకొని చట్టప్రకారం పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ, తహసీల్దార్ తదితర అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమీక్షలో జేసీ కేతన్‌గార్గ్, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 22: నగరంలో ఉన్న మైనార్టీ సంక్షేమశాఖ పోస్ట్‌మెట్రిక్ వసతిగృహంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ చదువుతున్న మైనార్టీ విద్యార్థులు అర్హులన్నారు. నగరానికి 5 కి.మీ దూరం నుంచి చదువుతున్న విద్యార్థులు రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు హాస్టల్ వార్డెన్ సెల్: 9666955006నుసంప్రదించాలన్నారు.

విజయవంతం చేయండి

అనంతపురంరూరల్, జూన్ 22: ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీపై నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధ్యక్షుడు రమణ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కొత్త కోర్సుల పేరుతో అధిక ఫీజులు వసూలు చేయడం జరుగుతోందన్నారు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈనెల 24న ఏపీ ఎమ్మార్పీఎస్, విద్యార్థి యువజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ర్యాలీ నిర్వహించడంతోపాటు కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఏమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దుండగులను వదిలిపెట్టం: ఎస్ఐ

గార్లదిన్నె, జూన్ 22: ఆలయంలో చోరీకి పాల్పడిన దుండగులను ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎస్ఐ మహ్మద్‌గౌస్ అన్నారు. మండల పరిధిలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి దుండగులు ప్రవేశించి ఆలయంలోని హుండీలు, బీరువాలు పగులగొట్టి రూ. 7. 80 లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించేందుకు పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యల్లో బాగంగా ఎస్ఐ మహమ్మద్‌గౌస్ సిబ్బందితో శనివారం కోటంక గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో మాట్లాడారు. అనంతరం సీసీ పుటేజీలను పరిశీలించారు.

జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జూన్ 22: జిల్లా రచయితల సంఘం(జిరసం) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో జరగనున్న పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి హాజరై కవి మధురశ్రీ రచించిన 'శ్వాసతో యుద్ధం' కవితా సంపుటిని ఆవిష్కరిస్తారన్నారు. సాహిత్యాభిమానులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

'నాణ్యమైన భోజనాన్ని అందించండి'



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్నఎంఈఓ-2

చెన్నేకొత్తపల్లి, జూన్ 22: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్ నాయుడు ఆదేశించారు. చెన్నేకొత్తపల్లిలోని కేజీబీవీ, దామాజుపల్లి ప్రాథమిక పాఠశాలలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సక్రమంగా ఇచ్చారా..? అన్న విషయాన్ని ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తయారీలో మెనూను తప్పకుండా పాటించాలని సూచించారు.

73667 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 22: జిల్లాలోని ఆర్బీకేల్లో శనివారం 24వ రోజు విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటిదాకా 81978 మంది రైతులకు 73667 క్వింటాళ్లు పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి దాకా 84165 మంది రైతులు 74274 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

27నుంచి జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 22: జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 27వ తేదీ నుంచి 30వతేదీ వరకు అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి తెలిపారు. శనివారం స్థానిక అశోక్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను సభ్యులు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వివిధ క్యాటగిరిల్లో బాల, బాలికలకు సింగిల్స్, డబుల్స్‌లో పోటీలు ఉంటాయన్నారు. అండర్-11కు సంబంధించి 2014 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు, అండర్-13కు 2012 జనవరి 1తరువాత, అండర్-15కు 2010 జనవరి 1తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. అండర్-17కు 2008 జనవరి 1వతేదీ తరువాత, అండర్-19కు 2006 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న క్రీడాకారులు ఈనెల 25వతేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 6281222500ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి జయకుమార్, ఉపాధ్యక్షుడు మహ్మద్‌షఫీ, సహాయ కార్యదర్శి అబ్దుల్‌అజీజ్, సభ్యులు నరేష్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన పెన్నహోబిలం ఆలయం


అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

ఉరవకొండ, జూన్ 22: మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయమే స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల అనంతరం ఆలయంలో నెలపూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. జిల్లా నలుమూలలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

వైభవంగా ప్రాకారోత్సవం: ఆలయంలో ప్రాకారోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకిలో కొలువుదీర్చారు. ఉత్సవమూర్తులను మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు.


భక్తులతో కిక్కిరిసిన ఆలయ ఆవరణం

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు


అలంకరణలో స్వామివారు

బొమ్మనహాళ్, జూన్ 22: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి వారికి శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు పూజా కార్యక్రమాలు జరిపించారు. వేకువ జామున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించి వెండి కవచం అలంకరణ, పుష్పలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. భక్తులకు అన్నదాన చేశారు.

పెద్దమ్మ ఆలయంలో...


అలంకరణలో అమ్మవారు

యాడికి, జూన్ 22: పౌర్ణమి పురస్కరించుకొని శనివారం యాడికిలోని పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పుట్లూరు: మండలంలోని సూరేపల్లి గ్రామంలో వెలసిన అచ్చెమ్మ తల్లికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆకు పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రామమోహన్‌నాయుడు, రామానాయుడు, రామాంజి పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

రాయదుర్గం రూరల్, జూన్ 22: మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అదే విధంగా వడ్రవన్నూరు సమీపంలో వెలసిన అపులాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ చేశారు.

నేటి నుంచి ఎర్రితాతస్వామి ఆరాధనోత్సవాలు


అలంకరణలో స్వామివారు

బెళుగుప్ప, జూన్ 22: అవధూత ఎర్రితాత స్వామి 88వ ఆరాధనోత్సవాలను మండల కేంద్రంలో ఆదివారం నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 23న శాంతిధామంలో గణపతి, గోపూజ, గంగపూజలు, ధ్వజారోహణం, పుణ్యాహవచనం, నంది వాహన సేవ, 24న ఉదయం అభిషేకాలు, బిల్వార్చన, పల్లకీసేవ, శేషతల్ప పూజాలంకరణలో పవిత్ర దర్శనం, రాత్రికి యర్రితాత స్వామి రథోత్సవం, 25న ఉట్ల పరుష, అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి, ఛత్ర ప్రభ అలంకరణలో స్వామి దర్శనం సాయంత్రం కోలాటం, రాత్రికి భజనలతో ఆరాధనోత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాలకు భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రవచనకర్తకు సత్కారం

పామిడి, జూన్ 22: పట్టణంలోని అనంత గజగరుడ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రవచనకర్త అనుంపల్లి భాస్కరరావును భక్తులు శనివారం సత్కరించారు. రెండున్నర సంవత్సరాలుగా వివేక చూడామణి గ్రంథపురాణ ప్రవచనం సాగిస్తున్నారన్నారు. గ్రంథం ముగింపు ఉతసవం సందర్భంగా ప్రవచనకర్తను సన్మానించారు. ఆలయ అర్చకులు విశ్వనాథ శర్మ, శాంతారాం, తల్లం లత, నారాయణస్వామి పాల్గొన్నారు.

సివిల్ సప్లై గోదాము తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి

గుత్తి, జూన్ 22: పట్టణంలోని సివిల్ సప్లై గోదామును శనివారం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి తనిఖీ చేశారు. గోదాములో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులను, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సరఫరా చేస్తున్న బియ్యంను తుకాల్లో తేడా రాకుండా చూడాలని స్టాకిస్ట్ మహబూబ్ బాషాను ఆదేశించారు. తహసీల్దారు భారతి, సీడీపీఓ డిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

ఉద్యోగి వేధింపులపై రేపు విచారణ: పట్టణంలోని సివిల్ సప్లై స్టాక్ పాయింట్‌లో పని చేస్తున్న తనపై స్టాకిస్ట్ మహబూబ్ బాషా వేధిస్తున్నాడని రెండు నెలల క్రితం మహిళా ఉద్యోగి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై శనివారం ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి స్టాక్‌పాయింట్‌ను పరిశీలించారు. స్టాకిస్ట్ మహబుబ్‌బాషాను విచారించారు. ఈ విషయంపై ఇరువురు 24వ తేదీన ఆర్డీఓ కోర్టుకు హాజరు కావాలని నోటీసులు అందించారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

గుత్తిరూరల్, జూన్ 22: మండలంలోని బేతాపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. 150 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పలకలు పెన్నులు ప్రొద్దుటూరుకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి అందజేశారు. ఉపాధ్యాయులు చంద్రకళ, సాధన, సుజాత, నిరుపమ, రామకృష్ణయ్య, శివప్రసాద్, రత్నకుమారి, మాదన్న పాల్గొన్నారు.


విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

హెచ్చెల్సీ మరమ్మతు పనులు ప్రారంభం

బొమ్మనహాళ్, జూన్ 22: హెచ్చెల్సీ కాలువ అత్యవసర మరమ్మతు పనులు శనివారం ఆ శాఖ అధికారులు ప్రారంభించారు. మండలంలోని హెచ్చెల్సీ 119 కి.మీ. వద్ద ఇటీవల కురిసిన వర్షానికి భారీగా వరదనీరు చేరి అండర్‌టెన్నల్ ద్వారా నీరు బ్లాక్ కావడంతో యూటీ దెబ్బతింది. 112 కి.మీ. వద్ద హెచ్చెల్సీ కాలువకు గండిపడింది. 1వ డిస్ట్రిబ్యూటరీ కాలువ దెబ్బతింది. 181 కి.మీ. నింబగల్లు వద్ద కాలువ గట్టు దెబ్బతింది. హెచ్చెల్సీ అధికారులు పరిశీలించి రూ.50 లక్షలకుపైగా ప్రతిపాదన పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రత్యేకంగా చొరవచూపి దెబ్బతిన్న యూటీ అండర్ టెన్నల్ ఛానల్, కాలువ గట్లు అత్యవసర మరమ్మతు పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. శనివారం జేఈఈ అల్తాఫ్ ఆధ్వర్యంలో 119 కి.మీ. యూటీ చానల్ వద్ద కంపచెట్లు తొలగించే ప్రక్రియ ప్రారంభించారు.


119 కి.మీ. యూటీ చానల్ వద్ద ఉన్న కంపచెట్లను తొలగిస్తున్న హిటాచి

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాయదుర్గంరూరల్, జూన్ 22: మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా గణాంక అధికారి మహ్మద్ రఫీ, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. శనివారం రాయదుర్గం అర్బన్‌లో వైద్యసిబ్బంది మలేరియా, డెంగీపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఏఎస్ఓ లక్ష్మీనరసమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉరవకొండ: మండల పరిధిలోని నెరమెట్ల గ్రామంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు వైద్యసిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీహెచ్‌వో నాగరంగయ్య, హెల్త్‌ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్ శేఖర్, వైద్యసిబ్బంది భగవాన్ దాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

గుత్తి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్


రాయదుర్గంలో ర్యాలీ చేస్తున్న మలేరియా సబ్ యూనిట్ వైద్యసిబ్బంది

శ్రీనివాసులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం సీజనల్ వ్యాధులపై తీసువాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, డయేరియా తదితర వ్యాధులు ప్రబలకుండా అమినిటీ సెక్రటరీలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

మొక్కు చెల్లించుకున్న టీడీపీ కార్యకర్తలు


టెంకాయలు కొడుతున్న కార్యకర్తలు

పెద్దపప్పూరు, జూన్ 22: తాడిపత్రి ఎమ్మెల్యేగా జేసీ అశ్మిత్‌రెడ్డి అఖండ మెజార్టీతో గెలవడంతో మండలంలోని ముచ్చుకోట గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం టీడీపీ కార్యకర్తలు 101 టెంకాయలు కొట్టి మొక్కుతీర్చుకున్నారు. ఎన్నికలకు ముందు మొక్కుకున్న మొక్కును కార్యకర్తలతో కలిసి తీర్చుకున్నట్లు నాగిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు తెలిపారు. కార్యక్రమంలో తాతిరెడ్డి బాబురెడ్డి, తాతిరెడ్డి దామోదర్‌రెడ్డి, నాగిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నడిమింటి నారాయణరెడ్డి, రామాంజి పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన జితేంద్రగౌడ్


అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జితేంద్రగౌడ్

గుంతకల్లుటౌన్, జూన్ 22: వ్యవసాయ శాఖా మంత్రిగా బాధ్యతలను చేపట్టిన అచ్చెన్నాయుడును శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ కలిశారు. విజయవాడలోని మంత్రి నివాసములో ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రేష్ఠలో ఎన్ఈటీఎస్‌లో సునీత్ వర్ధన్‌కు 285 ర్యాంక్



గుంతకల్లుటౌన్, జూన్ 22: శ్రేష్ఠ ఎన్ఈటీఎస్ ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియాలో 285 ర్యాంక్‌ను గుంతకల్లు పట్టణానికి చెందిన వై సునీత్ వర్ధన్ సాధించాడు. పట్టణంలోని పక్కీరప్ప కాలనీలో నివాసముంటున్న వై సుధాకర్, వై సుకన్య దంపతుల కుమారుడు సునీత్ వర్ధన్ కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మే 10న విజయవాడలో నిర్వహించిన పరీక్షలో పాల్గొన్నాడు. పరీక్ష ఫలితాల్లో ఆల్ ఇండియాలో 285 ర్యాంక్ సాధించాడు.

ఫుడ్ కార్పొరేషన్ కన్సల్టేటివ్ సభ్యురాలికి సన్మానం

గుంతకల్లుటౌన్, జూన్ 22: పట్టణంలోని జయ యోగా సెంటర్‌లో శనివారం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ కమ్యూనిటీ సభ్యురాలు విజయలక్ష్మిని సన్మానం చేశారు. జయ యోగా సెంటర్ నిర్వాహకురాలు జయలక్ష్మి మాట్లాడుతూ విజయలక్ష్మి భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

డయేరియా నివారణపై అవగాహన

తాడిపత్రిటౌన్, జూన్ 22: పట్టణంలోని శ్రీనివాసపురం-2 అంగన్‌వాడీ కేంద్రంలో డయేరియా నివారణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ సాజిదాబేగం మాట్లాడుతూ డయేరియా ఎలా వస్తుంది, కారణాలు వివరించారు. డయేరియా వచ్చిన తర్వాత ఓఆర్ఎస్‌ను తరచూ తాగుతూ ఉండాలన్నారు. సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, దస్తగిరమ్మ పాల్గొన్నారు.

అనుమతులు లేనిదే చెట్లు నరికితే చర్యలు


స్థానికులతో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

యాడికి, జూన్ 22: అటవీశాఖ అధికారుల అనుమతులు లేనిదే చెట్లను ఎవరూ నరకరాదని ఆ శాఖ గుత్తి సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి హెచ్చరించారు. యాడికిలో శనివారం నరికిన చెట్ల మొద్దులను కొందరు వ్యక్తులు తరలిస్తున్నారని హ్యూమన్‌రైట్స్‌కు చెందిన కొందరు వ్యక్తులు డీఎఫ్ఓకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాలతో ఆయన యాడికి వచ్చారు. చెట్ల మొద్దులు తరలిస్తున్న వారితోపాటు హ్యూమన్‌రైట్స్ సభ్యులతో మాట్లాడారు. అనుమతులు లేనిదే చెట్లను ఎవరూ నరకకూడదన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రిటౌన్, జూన్ 22: మండలంలోని బుగ్గ సమీపంలో 19వ తేదీన గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో గాయపడ్డ బూరుగల మధు (28) చికిత్స పొందుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లి గ్రామానికి చెందిన మధు బుగ్గ గ్రామానికి వచ్చి కూలీపనులు చేసుకొనేవాడు. 19వ తేదీన ద్విచక్రవాహనంపై పనికి వచ్చాడు. ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో బుగ్గలోని పెట్రోల్ బంక్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మధుకు భార్య అనిత, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రెండు గేదెలు...

బొమ్మనహాళ్, జూన్ 22: మండలంలోని నేమకల్లు గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి రెండు గేదె మృతిచెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన పింజరి వన్నూర్‌సాబ్‌కు చెందిన రెండు గేదెలు పాఠశాలలోని వెనుక వైపు మేత కోసం వెళ్లాయి. అక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మేత మేస్తుండగా కింద ఉన్న తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ రూ.1.10 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

యాడికి, జూన్ 22: పెద్దపప్పూరు మండలం నుంచి నంద్యాల జిల్లాకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం రాత్రి సీజ్‌చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు వచ్చిన సమాచారంతో చందన గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మూడు ట్రాక్టర్లలో తరలిస్తుండగా గుర్తించామని తెలిపారు. పెద్దపప్పూరు నుంచి నంద్యాలజిల్లాలోకి ఇసుకను తరలిస్తున్నట్లు తెలిపారు. సీజ్‌చేసిన ట్రాక్టర్లను యాడికి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కణేకల్లు: మండలంలోని వేదవతిహగరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కళేకుర్తికి చెందిన మల్లికార్జున అనే రైతు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.


భర్తపై కేసు నమోదు

పుట్లూరు, జూన్ 22: మండలంలోని కడవకల్లు గ్రామంలో భార్యను భర్త వేధిస్తున్నాడని శనివారం పోలీసులు తెలిపారు. భార్య అశ్వినికీర్తిని భర్త దామోదరం మద్యం తాగి వేధించడంతోపాటు కొడుతున్నాడని పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

లాడ్జిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

జడ్చర్ల, జూన్ 22: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి సమీపంలో జాతీయరహదారిపై ఉన్న హోటల్ సింధూర లాడ్జిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చాకల సురేశ్(36) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జడ్చర్ల ఎస్సై శివానందం శనివారం తెలిపిన వివరాల మేరకు... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గుంతకల్లు ప్రాంతానికి చెందిన సురేశ్ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సురేశ్ భార్య మంజూష, 3 సంవత్సరాల కుమార్తె యాషికాతో కలిసి హైదరాబాద్‌లోని చందానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 20న షాద్‌నగర్‌లో పని ఉన్నదని భార్యకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన సురేశ్ జడ్చర్లలోని హోటల్ సింధూర లాడ్జిలో శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ పరిస్థితుల్లో తనకు జీవించడం ఇష్టంలేదు అని సూసైడ్ నోట్ రాశాడని పోలీసులు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించామని, సురేశ్ భార్య మంజూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై శివానందం తెలిపారు.


జై భీమ్ లీగల్ అడ్వయిజర్‌గా అలెగ్జాండర్



కళ్యాణదుర్గంరూరల్, జూన్ 22: జై భీమ్ సంరక్షణ సమితి జిల్లా లీగల్ అడ్వయిజర్‌గా ఆర్‌కే అలెగ్జాండర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు విలియమ్స్ తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన హైకోర్టు న్యాయవాదులు డేనియల్, మల్లేష్ యాదవ్, ఆంటోనీలకు అలెగ్జాండర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలపక్షాన పోరాడుతున్న జై భీమ్ సంరక్షణ సమితి న్యాయసేవలు అందించడానికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

● ఎద్దుల పోటీల విజేతలకు నగదు అందజేత


విజేతలకు బహుమతులు అందిస్తున్న టీడీపీ నాయకులు

రాయదుర్గంరూరల్, జూన్ 22: మండలంలోని వడ్రవన్నూరు, జుంజురంపల్లి, రేకులకుంట, కెంచానపల్లి తదితర గ్రామాల్లో ఏరువాక పౌర్ణమిని శనివారం రైతులు ఘనంగా నిర్వహించుకున్నారు. రైతులు ఎద్దులను అందంగా అలంకరించి గ్రామ శివార్లలో వృషభాల పరుగు పందేలు నిర్వహించారు. గెలుపొందిన ఎద్దులను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామంలో ఏరువాక పున్నమి సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పోటీలలో విజేతలకు టీడీపీ నాయకులు నగదు బహుమతిని అందజేశారు. గ్రామానికి చెందిన హంపన్న అనే రైతుకు చెందిన ఎద్దులు విజేతగా నిలువగా వారికి టీడీపీ నాయకులు హనుమంతప్ప, టైలర్ రామాంజిని, జయన్న, దానప్ప, లింగప్ప, ఎర్రిస్వామి రూ.5 వేల నగదును అందజేశారు.

బొమ్మనహాళ్: మండలంలోని దేవగిరి గ్రామంలో శనివారం ఏరువాక పౌర్ణమిని గ్రామస్థుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. రైతులు ఎద్దులను అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో ఎద్దుల సవారి వదిలారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీకాంత్ ఎద్దు పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచింది. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. టీడీపీ నాయకులు అప్పారావు, గ్యాస్ గోవిందు, ఆంజనేయులు పాల్గొన్నారు.


ఎద్దు యజమానికి బహుమతి అందజేస్తున్న టీడీపీ నాయకుడు అప్పారావు

విశ్వా..! రెచ్చగొట్టే మాటలు మానుకో: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జూన్ 22: ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు రేగాటి నాగరాజు, పట్టణ కన్వీనర్ రామాంజనేయులు గోవింద్, నిరంజన్‌గౌడ్ సూచించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ దాడులు కొనసాగిస్తే ప్రతిఘటనలు చూడాల్సి వస్తుందని విశ్వేశ్వరరెడ్డి వ్యాఖ్యానించడంపై మండిపడ్డారు. టీడీపీ నాయకులు దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విశ్వ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి చెందిన మైనార్టీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేయలేదా అని ప్రశ్నించారు. మంత్రి కేశవ్ తన 30ఏళ్ల రాజకీయంలో ఫ్యాక్షన్, దాడులను ప్రోత్సహించలేదన్నారు. దాడుల సంస్కృతి మీదేనన్నారు. బీసీ మారెన్న, వేల్పుల శ్రీనివాసులు, ప్యారం కేశవానంద, ఎర్రగుంట్ల వెంకటేష్, వరప్రసాద్, సుదర్శన్, రాజేష్, ఎంసీ మారెన్న, వార్డు సభ్యులు ప్రభాకర్, వాసు, రవి పాల్గొన్నారు.

గుమ్మనూరు విజయంపై సంబరాలు


సొరకాయలపేటలో కేక్‌కట్ చేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, జూన్ 22: గుమ్మనూరు జయరాం ఎమ్మెల్యేగా గెలుపొందడంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 101 కొబ్బరికాయలను కొట్టి మొక్కు తీర్చుకున్నారు. పీర్లచావిడిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. టీడీపీ నాయకుడు వీరారెడ్డి ఇంట్లో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం విజయోత్సవ ర్యాలీలో గాయపడిన టీడీపీ కార్యకర్త రమేష్ గౌడ్‌ను ఈశ్వర్ పరామర్శించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ చౌదరి, అప్పన్నగారి కుమార్, మునలిరెడ్డి, బొమ్మా మోహన్‌కృష్ణ, ఆర్ఆర్ రమేష్, మాజీ సర్పంచు శ్రీనివాసులు, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

మైనార్టీ హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యల్లనూరు, జూన్ 22: మైనార్టీ సంక్షేమ హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారు హాస్టల్‌లో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

స్టాక్ పాయింట్ తనిఖీ

కణేకల్లు, జూన్ 22: మండల కేంద్రంలోని పౌరసరఫరాల స్టాక్ పాయింట్‌ను తూనికలు కొలతల శాఖ అధికారి శనివారం తనిఖీ చేశారు. చక్కెర నిలువలను పరిశీలించగా 500 గ్రాముల చక్కెల ప్యాకెట్లలో 30 గ్రాములు తక్కువ ఉన్నట్లు గుర్తించారు. ఆరు ప్యాకెట్లలో ఇలా రాగా వీటిని సరఫరా చేసిన హరికిషన్ అనే కంపెనీకి నోటీసులు పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అందుబాటులో బీబీఏ, బీసీఏ కోర్సులు

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 22: పట్టణంలో ఉన్న స్వామి వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో రెగ్యులర్ కోర్సులతో పాటు ఈ విద్యాసంవత్సరం నుంచి బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్, బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీ రామలింగప్ప, వైస్ ప్రిన్సిపాల్ కేశివన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులకు ఏఐసీటీఈ నుంచి అనుమతి లభించినట్లు తెలిపారు. దీనితో పాటు బీఏ, బీఎస్సీ, బీకామ్, హానర్స్ కోర్సులకు కూడా అడ్మిషన్లు ప్రారంభమైనట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

రాయదుర్గం రూరల్, జూన్ 22: మండలంలోని కెంచానపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఏపీఓ దేవరాజ్ శనివారం పరిశీలించారు. కూలీలు పనులు చేస్తున్న తీరును పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సొంత ఊర్లలోనే ప్రభుత్వం పని కనిపిస్తుందని వాటిని కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనులు నాణ్యతగా చేస్తే వంద శాతం కూలి పడుతుందన్నారు. కెంచానపల్లి, జుంజురంపల్లి, మల్కాపురం, ఆవులదట్ల, వేపరాల తదితర ప్రాంతాల్లో రోజుకు రెండు వేల మంది కూలీలు హాజరవుతున్నట్లు తెలిపారు. కూలీలను పెంచాలని ఫీల్డు అసిస్టెంట్లకు సూచించారు. ఈసీ నాగభూషణం పాల్గొన్నారు.